# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 27 జూన్ , 2026 | పేజీలు : 5


## ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం

### మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

ప్రజాపక్షం/నల్గొండ టౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేదలకు వరం లాంటిదని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 67 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.24,69,000 విలువగల చెక్కులను శుక్రవారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం చేయించుకోలేని అనేక మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం



ద్వారా ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఇంద్రసేనారెడ్డి, రాచకొండ గిరి,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలాంటి ఇబ్బందులు రావొద్దు

### సిఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి
### రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఆదేశం



వివరాలు మెయిన్‌లో

## ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి
### యూత్ కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలి



వివరాలు మెయిన్‌లో

## 28న సిఎం బహిరంగ సభ



వివరాలు మెయిన్‌లో

### భారీ సంఖ్యలో తరలిరావాలని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పిలుపు

# అప్పులు..ఆస్తి, ఆశ..పాత కక్షలు..!

### అక్కకూతురు -అల్లుడి కుట్ర.. నలుగురి ప్రాణాలు బలి
### నల్లగొండలో నాలుగు హత్యల కేసు ఛేదన
### మృతురాలి అక్క కూతురు, అల్లుడే మాస్టర్ మైండ్స్.. నలుగురు నిందితుల అరెస్ట్
### జిల్లా శరత్ చంద్ర పవార్ వెల్లడి





వివరాలు మెయిన్‌లో





## ఎమ్మెల్సీ సత్యంకు సన్మానం

**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం ఇడికూడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మొహరం పండుగకు హాజరైన సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను ఇడికూడ గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కడారి లక్ష్మణ్ యాదవ్ ఎమ్మెల్సీ సత్యంకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు , ప్రజాపక్షం చండూరు రిపోర్టర్ కర్నాటి వెంకటేశం , మండల కార్యవర్గ సభ్యులు బండమీది వెంకన్న, సిహెచ్ ఊషయ్య , గడ్డం నవీన్ , ఇరిగి ప్రవీణ్ , అన్నెపాక రాజీవ్ , వెంకన్న, నర్సింహ్మా పాల్గొన్నారు.

## 'సర్' ప్రారంభం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని చెన్నకేశవపురం గ్రామంలో ఓటర్ (సర్) ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంను శుక్రవారం సర్పంచ్ గోసుల రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ప్రత్యేక సమగ్ర సవరణను పకడ్భందింగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమలో జిపివో నారాయణరావు, బిఎల్‌వో సంకోజు సతీష్, ఆర్ఎంపి కొత్త ఉపేందర్, జానాచారి పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** యువత మత్తు పదార్ధాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్ధాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. గ్రామంలో ఎవరైనా గంజాయి లేదా ఇతర నిషేదిత డ్రగ్స్ విక్రయించినా రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్ధాలతో జీవితాలు నాశనం అవుతాయన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షం కోసం పూజలు

**ప్రజాపక్షం/చిట్యాల:** సకాలంలో వర్షాలు కురవాలని వానదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెంబావి గ్రామ ప్రజలు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికి వర్షాలు ముఖం చాటేస్తుండటంతో వర్షాల రాక కోసం దేవుళ్ళకు పూజలు చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, గ్రామంలోని ప్రజుల సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ గ్రామస్థలంతా పూజాకార్యక్రమాలలో పాల్గొంటున్నారు. గ్రామంలోని బొడ్రాయికి నీళ్ళను ఆరబోసిన మహిళలు వానదేవుడికి పాటల రూపంలో ప్రార్ధనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలివేలువెంకన్నగౌడ్, ఉప సర్పంచ్ శివయాదవ్ పాల్గొన్నారు.



## విద్యార్థి సంఘాల పేరుతో విద్యార్థులకు అసౌకర్యం కలిగించొద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యార్థి సంఘాల పేరుతో విద్యార్థులకు అసౌకర్యం కలిగించవద్దని డిఎస్పి ప్రసన్న కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో గల ఓ ప్రైవేట్ పాఠశాలలోకి కొంత మంది వ్యక్తులు విద్యార్థి సంఘాల పేరుతో అక్రమంగా చొరబడి కార్యాలయం తాళాలు పగలగొట్టి, పెద్దగా నినాదాలు చేస్తూ విద్యార్థులను భయాందోళనకు గురిచేసిన విషయమై యాజమాన్యం ఫిర్యాదు చేసిందని తెలిపారు. దానిపై పట్టణ పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘ నాయకులు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. పాఠశాలల్లో, విద్యాసంస్థల్లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం, విద్యార్థులను రవాణా చేసే బస్సులను అడ్డుకోవడం, యాజమాన్యాలను లేదా ఉపాధ్యాయులను బెదిరించడం, పెద్ద శబ్దాలతో నినాదాలు చేస్తూ విద్యార్థులు భయపడేలా వాతావరణం సృష్టించడం, చందాల రూపంలో డబ్బు వసూళ్లు చేయడం వంటి చర్యలకు పాల్పడడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు.

## బిసిల ఐక్యతతోనే రాజ్యాధికార సాధన సాధ్యం




**ప్రజాపక్షం/ఆత్మకూరు(ఎం):** భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభకు సంబంధించి ఆత్మకూర్(ఎం) తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షులు ఎలిమినేటి బుచ్చయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క పార్టీ వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పటేల్ వనజక్క మాట్లాడుతూ బీసీ సంఘాలు, సామాజిక సంస్థలు, ఉద్యమకారులు, మేధావులు ఐక్యంగా ముందుకు వచ్చినప్పుడే బీసీ రాజ్యాధికార సాధన సాధ్యమవుతుందని అన్నారు. బీసీ వర్గాల రాజకీయ హక్కుల కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. జులై 05న భువనగిరిలో నిర్వహించే రాజ్యాధికార సమరభేరి సభ బహుజన వర్గాల రాజకీయ చైతన్యానికి, ఐక్యతకు చారిత్రాత్మక వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ సభకు బీసీ సంఘాల నాయకులు, యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, సామాజిక ఉద్యమకారులు, బహుజన వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇ.ఓదేలు యాదవ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బి.నర్సయ్య గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పిట్టల శంకర్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పిట్టల సుశీల, నాగరాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మి ఆలయ ప్రతిష్ఠ : భక్తుల సందడి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని విద్యానగర్ కాలనీ సబ్ జైల్ రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ మహాలక్ష్మి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకోవడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రతిష్టా వేడుకల సందర్భంగా ఉదయం 9 గంటలకు మహాస్నపనం నిర్వహించి అనంతరం చండీ హోమం చేపట్టారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించిన హోమ కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ప్రతిష్టా విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణాన్ని పుష్పాలతో అలంకరించారు. శ్రీశైల విద్యాపీఠ ఆచార్యులు నాగరాజు శర్మ, ఆలయ అర్చకుడు స్వయంపాకుల భద్రయ్యశర్మల ఆధ్వర్యంలో వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధార్మిక సంప్రదాయాలకు అనుగుణంగా ప్రతిష్టా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు శర్మ, స్వయంపాకుల భద్రయ్య శర్మ, వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## సిసిరోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహయ సహకారాలతో మంజూరైన 15 లక్షల రూపాయలతో సిసిరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, వెలిదండ సర్పంచ్ చెనగాని సాంభయ్య, మలిదశ ఉద్యమకారుల కన్వీనర్ మేకల నాగేశ్వరావు లు సంయుక్తంగా కలిసి అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహయ సహకారాలతో వెలిదండ గ్రామ సమగ్ర అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యనాల సోమయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీసాల వెంకటేశ్వర్లు, చెన్నగాని రామయ్య, చెన్నగాని మట్టయ్య, కోటయ్య, పద్మ, గండు యల్లయ్య పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరం




**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థి జీవితంలో ముఖ్యంగా ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్ధులు మత్తు పదార్ధాలకు దూరంగా ఉండాలని, తద్వారా తమ ఆరోగ్యాన్ని, జీవితాన్ని కాపాడుకోవాలని కోదాడ డిఎస్పి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోదాడ పట్టణంలోని ఎన్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో మత్తు పదార్ధాలు వాటి వల్ల కలిగే అనర్ధాలపై విద్యార్ధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ కీలక దశ అని, ఈ విషయంలో విద్యార్ధులు ఎలాంటి చెడు అలవాట్లకు లోనూ కాకుండా చదువుపై దృష్టి పెట్టి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్ధులతో మత్తు పదార్ధాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ శివశంకర్‌నాయక్, ఎస్ఐలు సుధీర్‌కుమార్, అంజిరెడ్డి, మల్లేష్, కాలేజీ చైర్మన్ వడ్డే రాజేష్‌చౌదరి, డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, అకాడమిక్ డిఎన్ నటరాజ్, పిఆర్‌వో మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

## పెండ్లి ఇంట్లో చోరీ కలకలం

**ప్రజాపక్షం/చిట్యాల:** పెండ్లి జరుగుతున్న వేళ పెండ్లి ఇంట్లో కన్నం వేసిన దొంగ నగదు, బంగారం చోరీ చేసిన ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన శిరస్సు ముత్యాలు తన కూతురు వివాహాన్ని ఈ నెల 25 గురువారం రోజున రామన్నపేటలోని ఒక ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఇంటికి తాళం వేసి పెండ్లికి వచ్చిన బంధువుల కలిసి కుటుంబ సభ్యులంతా ఫంక్షన్ హాలుకు వెళ్ళారు. పెండ్లి ముగించుకుని ఇంటికి వచ్చిన ముత్యాలు కుటుంబానికి ఇంటి తాళం పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్ళి వారు చూడగా బీరువాలో దాచి పెట్టిన రూ. 5లక్షల నగదుతో పాటు 2 తులాల బంగారం దొంగిలించబడినట్లు గుర్తించారు. చుట్టుపక్కల ఉన్న సిసి కెమెరాలను పరిశీలించగా ఒక వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యక్తి వివాహ కార్యక్రమాలలో భాగంగా గుర్రపు బండి ఊరేగింపు కోసం హైదరాబాద్ నుండి వచ్చిన జట్టులో వ్యక్తిగా ఉన్నట్లు, అతను జట్టు నుండి మధ్యలోనే వెళ్ళిపోయినట్లు తెలుస్తుంది. పోలీసులు చోరీ కేసుపై విచారణ చేపట్టారు.

## అర్వపల్లి ఎస్ఐగా మధు



**ప్రజాపక్షం/అర్వపల్లి :** అర్వపల్లి ఎస్ఐగా పి. మధు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన నల్లగొండ నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ గత కొద్ది రోజుల క్రితం విధుల్లో అలసత్వం కారణంగా సస్పెన్షన్‌కు గురయ్యారు.



## ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ

ప్రజాపక్షం/తుంగతుర్తి : ఓటు హక్కును కాపాడుకో వాల్సిన బాధ్యత ప్రతి పౌరుడికి తప్పనిసరిని సర్పంచ్ మేడ్దల రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో సర్ ప్రక్రియలో భాగంగా బిఎల్ఓ శారద ఎన్యుమరేషన్ పత్రాలను ఇంటింటికి అందజేస్తున్న క్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 25 నుండి వచ్చే నెల 24వ తేదీ వరకు ప్రతీ ఓటరు ఇంటిని బిఎల్ఓలు సందర్శిస్తూ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పూర్తి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేర్ల పాపయ్య, కుంచం సందీప్, బిఎల్ఏలు మెంతబోయిన సింహాద్రి, కరుణాకర్ పాల్గొన్నారు.

## మృతదేహానికి నివాళులు



ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన కోనూరు గోపాల్ గౌడ్ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శుక్రవారం సిరిపురం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, సర్పంచులు అంబటి ఉపేంద్రమ్మ రవీందర్ రెడ్డి, గర్దాస్ విక్రమ్, పులిపలుపుల సునీత, మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, జిల్లా నాయకులు బద్దుల రమేష్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుడిని పరామర్శ

ప్రజాపక్షం/గరిడేపల్లి: మడంల పరిధిలోని కల్మల్ చెర్వు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు నట్టె సైదయ్యను శుక్రవారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పిల్లుట్ల రఘు పరామర్శించారు. ఇటీవల హుజూర్‌నగర్‌లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ సమావేశానికి హాజరై ఇంటికి వెళ్తున్న సమయంలో కీతవారిగూడెం సమీపంలోని బానుచందర్ రైస్ మిల్లుకు చెందిన రేకులు అతనిపై పడటంతో రెంటుకాళ్లు విరిగిపోయాయి. చికిత్స నిర్వహించిన అనంతరం అతన్ని ఇంటికి తీసుకరాగా శుక్రవారం ఆయన పరామర్శించారు. నట్టె సైదయ్యకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గుగులోతు కృష్ణనాయక్, జగన్‌నాయక్, గుత్తికొండ ప్రమీల రమణారెడ్డి, రాపోలు నవీన్‌కుమార్, వీరంరెడ్డి చంబిరెడ్డి, రామనాథం, సుధీర్, బచ్చలకూర శ్రీనివాస్, సుధా నాగరాజు, కుక్కునూరి అంజయ్య, కర్నాటి నాగిరెడ్డి, దొంతగాని రాంబాబు, మద్ది భాస్కర్ పాల్గొన్నారు.



# యశోదలో అత్యాధునిక ఎక్మో వైద్యం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతూ చివరి దశ శ్వాసకోశ వైఫల్యానికి చేరుకున్న రోగులకు అత్యాధునిక ఎక్మో వైద్యం కొత్త ఆశలు కల్పిస్తోందని హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాట్రగడ్డ తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ఎక్మో విధానం ప్రత్యేకతలు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాల గురించి వివరించారు.శ్వాసకోశ సమస్యలు తీవ్రమై ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితుల్లో రోగి ప్రాణాలను కాపాడటంలో ఎక్మో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఊపిరితిత్తులు రక్తానికి తగినంత ఆక్సిజన్ అందించలేని సమయంలో ఈ విధానం కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థగా పనిచేస్తుందని పేర్కొన్నారు. శరీరంలోని ఆక్సిజన్ లేని రక్తాన్ని బయటకు తీసుకుని, దానికి అవసరమైన ఆక్సిజన్ అందించి, కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి తిరిగి శరీరంలోకి పంపే ప్రక్రియ ద్వారా రోగి ప్రాణాలను నిలబెట్టవచ్చని తెలిపారు.చివరి దశ ఇంటర్ స్టీషియల్ లంగ్ డిసీజ్, తీవ్రమైన శ్వాసకోశ వైఫల్యం, ఊపిరితిత్తుల మార్పిడి అవసరమయ్యే రోగులకు ఎక్మో ఒక కీలక ఆధారంగా నిలుస్తోందన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల మార్పిడి కోసం ఎదురుచూస్తున్న రోగులకు దాత లభించే వరకు ప్రాణాలను కాపాడటంలో ఈ సాంకేతిక విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలకు అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్, ఊపిరితిత్తుల మార్పిడి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ విభాగం మేనేజర్ ఉమేష్, బస్టాండ్ మేనేజర్ రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో తీవ్రమౌతున్న కోతుల బెడద



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో కోతుల బెడద రోజు రోజుకు తీవ్రమౌతుంది. గుంపులు గుంపులుగా సంచరిస్తూ కోతులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు వాటి నుండి తమను సంరక్షించుకునేందుకు తంటాలు పడాల్సి వస్తుంది. కోతులు దాడి చేస్తాయోమోనన్న ఆందోళనతో ప్రజలు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాల్సి వస్తుంది. పెంకులు, రేకుల ఇండ్లు కలిగిన ఇండ్లపైకి చేరుకుని వాటిపైనున్న పెంకులను, రేకుల పగుల గొడుతూ నష్టపరుస్తున్నాయి. ఇండ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం వంటి సంఘటనలూ సరాసరి. ఇక పెరట్లోని చెట్లను పీకి పారేస్తున్నాయి. పండ్లు, కాయగూరల పంటలను కోతులు చేస్తున్న నష్టం కారణంగా తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. అన్ని గ్రామాలలో కోతుల సమస్య విపరీతంగా ఉంది. కొన్ని గ్రామాలలో గ్రామ పంచాయతీకి నూతనంగా వచ్చిన సర్పంచ్, వార్డు సభ్యులు కోతుల ఏరివేతకు ప్రయత్నాలు చేసినా వాటి పూర్తి ఏరివేత మాత్రం జరగలేదు. వాటి నివారణ అనేది పాలక వర్గానికి తలనొప్పిగా మారింది. కోతుల నివారణకు శాశ్వత పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి తమకు భద్రత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ బంద్ అయ్యేంత వరకూ ఉద్యమాలు



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడి బంద్ అయ్యేంత వరకు ఎన్ని నిర్బంధాలు వచ్చినా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ, పిఐఎస్‌యు జనసేవా సమితి, పిడిఎస్‌యు, పిడిఎస్‌యు, బిసి విద్యార్థి సంఘాల నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల దగ్గర నుండి వివిధ రకాల ఫీజుల పేరుతో లక్షల రూపాయలు దోపిడికి పాల్పడుతున్నా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభం నాటి నుండి ప్రభుత్వ నిబంధనలను, గవర్నమెంట్ ఆర్డర్స్‌ను తుంగలో తొక్కి యదేచ్చగా ఫీజుల దోపిడికి పాల్పడుతున్నారని విమర్శించారు. నర్సరీ నుండి పదవ తరగతి వరకు వారి ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఏ ఒక్క పాఠశాల కూడా ప్రభుత్వ నిబంధనలను అమలు చేయడం లేదని ఆరోపించారు. అనుమతులు లేకుండా వసతి గృహాలు నడపడం, పాఠశాలల్లో దుకాణాలు తెరిచి పార్యపుస్తకాలు, బెల్టు, షూ, యూనిఫామ్ తదితర వస్తువులను అధిక రేట్లకు విక్రయిస్తూ విద్యను వ్యాపారం చేశారని మండిపడ్డారు. పలు పాఠశాలల్లో అర్హత లేని ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, పిఐఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు, జనసేవ సమితి అధ్యక్షులు తగుళ్ల జనార్దన్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి, బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పోలీజు మహేష్ పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం బాధ్యత



ప్రజాపక్షం/తుంగతుర్తి : మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని తుంగతుర్తి సిఐ ఉపేందర్ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్కిల్ పరిధిలోని తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ పోలీస్ సిబ్బంది అందరూ కలిసి మండల కేంద్రంలో విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల ఎస్ఐలు క్రాంతి కుమార్, వీరన్న, నాగరాజు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రతి రైతూ అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి

ప్రజాపక్షం/నడిగూడెం: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి రైతు తమకున్న వ్యవసాయ భూమిలో తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని సిరి పొండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మొలుగూరి గోపయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బృందావనపురం, వేణుగోపాలపురం గ్రామాలలో సిరిపొండేషన్ ఆధ్వర్యంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంపై రైతు చైతన్యయాత్ర కార్యక్రమంలో మాట్లాడారు. గత 65 ఏళ్లుగా చేస్తున్న రసాయన వ్యవసాయంతో భూసారం దెబ్బతిన్నదన్నారు. భూసారం పెరగాలంటే ఇప్పటి నుండే ప్రతిరైతు నేలకు పశువుల పెంట, చెరువు మట్టి తొలుకోవాలన్నారు. జీవామృతం, ఘన జీవామృతం నేలకు వాడాలన్నారు. జీలుగ, పిల్లి పెసర, జనుములాంటి పచ్చరొట్ట పంటలను సాగుచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కంభంపాటి సరిత, వేల్పుల సోమయ్య, మాజీ సర్పంచులు అనంతుల అంజనేయులు, బెల్లంకొండ హనుమయ్య, రైతులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి 15వ వార్షికోత్సవం



ప్రజాపక్షం/గరిడేపల్లి: మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో వెలసిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో పంచదశ 15వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటి ఆధ్వర్యంలో భక్తులకు కనులవిందుగా ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. కీర్తిశేషులు వెంకటేశ్వర్లు ప్రమీల ఇంటి వద్ద నుండి స్వామి వారికి పట్టువస్త్రాలతో శోభయమానంగా ఊరేగింపు నిర్వహించారు.ఉదయం 9 గంటల నుండి సహస్రనామార్చన, విశేష అలంకరణలు, శ్రీలక్ష్మి గణపతి, రుద్ర మూర్తి మూలమంత్ర హోమాలు, మహాపూర్ణాహుతి, అవభృతం, మహాదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. పూజ కార్యక్రమాలను దేవాలయ అర్చకులు రాయపోలు భద్రయ్యశర్మ, శ్రీరామయ్య శర్మ వేదమంత్రాల మద్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భద్రత తొలగిస్తే తీవ్ర పరిణామాలు

ప్రజాపక్షం/గరిడేపల్లి: 26 సంవత్సరాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి పోలీస్‌శాఖలో సేవలందించిన మాజీ ఐపిఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కల్పిస్తున్న బుల్లెట్ ప్రూఫ్ వాహనం, భద్రత సిబ్బందిని కొనసాగించాలని స్వేరోస్ రాష్ట్ర నాయకులు ప్రేమ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడవుల్లోకి వెళ్లి మావోయిస్టులతో చర్చలు జరిపి, వందలాది మంది నక్సలైట్లను జనజీవన స్రవంతిలోకి తీసుకవచ్చిన అధికారిగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇప్పటికే ప్రాణహాని ఉన్నదని విషయం అందరికి తెలిసిందేనన్నారు. అలాంటి వ్యక్తికి గత ప్రభుత్వాలు కల్పిస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే భద్రతను తగ్గించే ప్రయత్నాలు జరగడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగేందర్, నవీన్, కిషోర్, చిన్న ప్రవీణ్, నరేష్‌నాయక్, శ్రీను నాయక్, అంజిరెడ్డి పాల్గొన్నారు.





## ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కొండమల్లేపల్లి పట్టణంలోని 9వ వార్డులో గురువారం బిఎల్‌వోలు ఇంటింటికి వెళ్ళి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణి చేశారు. వారి వెంట సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి వెళ్ళి బిఎల్‌వోలకు సహకరించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు ఎవరూ అపోహలు నమ్మవద్దని, ఎవరి ఓట్లు కూడా తొలగించరని అన్నారు. ప్రజలు ఎన్యూమరేటర్లు ఇంటి వద్దకు వచ్చి ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను వారి చెప్పిన వివరాలతో తప్పులు లేకుండా నింపి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా బిఎల్‌వోలను అడిగి తెలుసుకొని ఫారాలు నింపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌వోలు సిహెచ్. మాణిక్యమ్మ, కోట్ల శోభ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహప్రవేశాలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామంలో సామూహిక ఇందిరమ్మ గృహప్రవేశాలు చేశారు. శుక్రవారం జరిగిన కుంభం భార్గవి లింగస్వామి, ఉడుతల భాగ్యలక్ష్మ భాస్కర్, కాసుల అనిత చందు, బొడిగె మానస నర్సింహా గౌడ్, బొంగు బాలమణిల లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో గ్రామ సర్పంచ్ మచ్చ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

## గొంగిడి సునిత పరామర్శ



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంని మాసాన్ పల్లి గ్రామ సర్పంచ్ పంగ జయసుధ మామ, పెద్దపడిషాల గ్రామానికి చెందిన ఎస్టి సెల్ మండల అధ్యక్షుడు చర్లపల్లి రమేష్ తండ్రి, రామారం గ్రామానికి చెందిన అట్ల నర్సిరెడ్డి మాతృమూర్తి లు ఇటీవల మరణించడంతో శుక్రవారం మాజీ ఎంఎల్‌ఏ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి వారి నివాసాలకు వెళ్ళి మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబాల ను పరామర్శించారు. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఖలీల్, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, జయసుధ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

## రిసెప్షన్‌లో గ్రామ సర్పంచ్‌లు

**ప్రజాపక్షం/రామన్నపేట** : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని బోగారం గ్రామానికి చెందిన గుంతకంట్ల సంజీవరెడ్డి అండాలు వారి చిన్న కుమారుడి వివాహ రిసెప్షన్లో గ్రామ సర్పంచ్ కూనురు సాయికుమార్ గౌడ్ ,ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.



# బహిరంగ సభను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/తిప్పర్తి :** ఈనెల26న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొనే బహిరంగ సభకు మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ పాశం రాం రెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం మండలం లోని మర్రిగూడెంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన అందరి అభిమాన నాయకుడు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అత్యధిక నిధులు తీసుకొచ్చి నల్లగొండ పట్టణాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేసిన విషయం మనందరికీ తెలిసిందేనని అన్నారు. ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్గొండ సమగ్ర అభివృద్ధికి కావలసిన నిధుల మంజూరు గురించి ప్రకటిస్తారని చెప్పారు.ఈ సమావేశంలో నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, తిప్పర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం సుధీర్, పాశం సంపత్ రెడ్డి,ముత్తినేని శ్యాంసుందర్,పాతూరి శ్రీనివాస్ రెడ్డి, సందీప్ రెడ్డి, ఎల్లంల సతీష్,కోనవెంకన్న,దాసరి జానయ్య,దొంతినేని నాగేశ్వరరావు,శోభన్ బాబు,పల్లె ఎల్లయ్య,ఎస్‌కే అలీ, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'సర్' ప్రక్రియలో నిర్లక్ష్యం వద్దు



**ప్రజాపక్షం/నందికొండ** : మున్సిపాలిటీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం రెండో రోజు చురుగ్గా కొనసాగింది.కార్యక్రమంలో భాగంగా పెద్దవూర మండల తహసీల్దార్ ఖాసీం నాయక్ బూత్ నంబర్లు 107,110,111,112,113లను సందర్శించి సర్ అప్లికేషన్ల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు.బీఎల్‌వోలు,బీఎల్ఏలతో మాట్లాడి అప్లికేషన్ల పంపిణీ, ప్రజల స్పందనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నందికొండ మున్సిపాలిటీ పరిధిలో సర్ అప్లికేషన్లు పొందిన ప్రతి ఓటరు వాటిని పూర్తిగా నింపి నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్‌వోలకు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు.అప్లికేషన్లు సమర్పించకపోతే ఓటరు జాబితాలో పేరు కొనసాగింపుపై ప్రభావం పడే అవకాశం ఉందని, అందువల్ల ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ప్రజల సహకారంతో కార్యక్రమం సజావుగా, చురుగ్గా కొనసాగుతుండటం సంతోషకరమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అశోక్,బీఎల్‌వోలు దేవిక, సైదులు,రాధిక,కీర్తిరెడ్డి,కిషోర్,బీఎల్ఏలు రమేష్, విజయ్,శేఖర్‌బాబు,లక్ష్మణ్ నాయక్,మన్సూర్, కేశవ్, సునీల్, పవన్, మహేష్ పాల్గొన్నారు.

# యూరియాను నేరుగా రైతులకు పంపిణీ చేయాలి




**ప్రజాపక్షం/తుంగతుర్తి :** రైతులకు ప్రభుత్వం అందిస్తున్న యూరియాను యాప్ ద్వారా కాకుండా నేరుగా పంపిణీ చేయాలని సిపిఎం రాష్ట్ర సభ్యుడు కొలిశెట్టి యాదగిరి రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవనంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ యాప్ ద్వారా యూరియాను అందించడం ద్వారా ఎక్కువ మంది రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విచారణ వ్యక్తం చేశారు. చాలా మంది రైతులకు స్మార్ట్‌ఫోన్ లేకపోవడం చేత ఓటిపి చెప్పే సమయంలోనే యూరియా పూర్తిగా అయిపోతుందని దీని చేత ఎక్కువ మంది రైతులు యూరియాను పొందలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని నేరుగా రైతులకు యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసాను వానాకాలం పంట ప్రారంభమైనందున వెంటనే రైతుల ఖాతాలో రైతుభరోసాను వేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటి సభ్యులు బుర్ర శ్రీనివాసు, కందాల శంకర్ రెడ్డి, మండల కార్యదర్శులు వజ్జె శ్రీను, గుమడవెల్లి ఉప్పలయ్య, దేవరకొండ యాదగిరి పాల్గొన్నారు.

# లక్ష్మాపురం రిజర్వాయర్ పనులు తక్షణమే పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/నాంపల్లి** : మండలంలోని లక్ష్మాపురం రిజర్వాయర్ పనులను వేగవంతం చేసి,అధిక నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు,తాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు.శుక్రవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, బంగారిగడ్డ నుంచి కొత్తబాయి వరకు డబుల్ రోడ్డు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా పనులు సాగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ పనులు తక్షణమే పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఉద్యమ రూపం దాల్చాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈసమస్యలపై మునుగోడు ఎమ్మెల్యే బాధ్యత తీసుకుని ముందుండి పూర్తి చేయించాలని కోరారు. వర్షాకాలం కావడంతో గ్రామీణ రోడ్లు చిత్తడిగా మారి, చెత్తాచెదారంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి,మండల కమిటీ సభ్యులు వాసిపాక ముత్తిలింగం,నాంపల్లి రమణ,కొమ్ము ముఖేష్, పల్లెటి వెంకటయ్య, కొమ్ము లక్ష్మయ్య, రాజు,ఎల్లేష్ పాల్గొన్నారు.



## జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శంబాల వెంకటేష్ జన్మదినం నకిరేకల్‌లోని వారి క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి శంబాల వెంకటేష్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వెంకటేష్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

## ఓటర్ల సమగ్ర సర్వే



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట పట్టణ కేంద్రంలో ఎస్ఆర్ స్పెషల్ ఓటర్ల సమగ్ర సర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఇందులో భాగంగా పట్టణంలోని క్రిష్టియన్ కాలనీలో గల పోలింగ్ బూత్ నెంబర్ 37 లో ఓటర్ల నమోదు, మార్పులుచేర్పులకు సంబంధించిన దరఖాస్తులను విస్తృతంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ సర్వే నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ 'బిఎల్ఏ'కవితతో కలిసి ప్రతి ఇంటినీ సందర్శించి ఫారాలను అందజేశారు.కొత్తగా ఓటు హక్కుకు అర్హులైన యువతీ యువకులు, కాలనీవాసులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు, ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బిఎల్ఏలతో పాటు స్థానిక ముఖ్య నాయకులు వనం చంద్రశేఖర్, ఎండి కరీం, రాహుల్ తదితరులు పాల్గొని సర్వేను విజయవంతం చేశారు.

## మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రజాపక్షం/భువనగిరి :** ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా భువనగిరిలోని 22వ వార్డు పరిధిలోని ఇందిరానగర్, పోచమ్మవాడ లో కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించి ఫాగింగ్ చేయించడం జరిగింది. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలని నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచకూడదని తెలిపారు. మునిసిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు మురిజి కాలువలు, రోడ్లు శుభ్రపరు స్తున్నారని ఏమైనా సమస్య ఉంటే దృష్టికి తీసుకురావాలని అన్నారు. గౌరవ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో పారిశుధ్యానికి సంబంధించి కొత్త వాహనాలకు ఇతర సామాగ్రికి కూడా నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్ల కిషోర్, వార్డు ఆఫీసరు రాము, భూషపక మనీష్, కోళ్ల ప్రవీణ్, పడిగెల మని, బర్రె వరుణ్, దినేష్, జవాన్ శ్రీధర్ మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు







**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మొహర్రం పండుగ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కొండమల్లేపల్లి సర్కిల్ సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్‌లు అన్నారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలో గురువారం రాత్రి మొహర్రం వేడుకలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. వారి వెంట సర్పంచ్ ఆదిరాల రమేష్, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో , మండలంలోని వివిధ గ్రామాలలో మోహర్రం పండుగ వేడుకలను ముస్లీం, హిందూ సోదరులు కలిసి భక్తి శ్రద్ధలతో ఘణంగా జరుపుకున్నారు. గ్రామంలోని పీర్లను రంగు రంగుల వస్త్రాలు, పూలమాలలు, వివిధ అలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్ది గ్రామ ప్రధాన వీధులలో ఊరేగించారు. మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో జరిగిన పీర్ల ఊరేగింపు కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ భక్తి భావాన్ని చాటారు. డప్పుల మోతలు, సాంప్రదాయ వాద్యాల నడుమ సాగిన పీర్ల ఊరేగింపుతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. త్యాగం, ధర్మం,



న్యాయాలకు ప్రతీకైన ఈ పండుగను ప్రతి సంవత్సరం అన్ని వర్గాల ప్రజలు కలిసి వేడుకలా జరుపుకోవడం గ్రామ ప్రత్యేకతని గ్రామస్థులు తెలిపారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మొహర్రం పండుగను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ పండుగను త్యాగం, మానవత్వం, ఐక్యతకు ప్రతీకగా ప్రజలు సామరస్యంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా యువత పీర్లను (తాజియా) డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి ఈశ్వర్ థియేటర్ సమీపంలో బావిలో నిమజ్జనం చేశారు. కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో పండుగను ప్రశాంతంగా జరుపుకున్నారు.

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం తుర్కలషాపురం గ్రామంలో ఘనంగా మొహర్రం పండుగ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథగుప్త మొహర్రం వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీర్ల కొట్టానికి దశరథగుప్త 10వేలను అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో రమేష్, నరేందర్, జిలాని, రంజిత్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ 'సర్' ఫారాలు పంపిణీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మునిసిపల్ వివిధ వార్డుల్లో ప్రత్యేక ఓటర్ల విస్తృత సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను అశోక్ నగర్, ఈదులగూడ, రాంనగర్ కౌన్సిలర్లు ఎం.ఎ,సలీం, పొట్టేపాక శ్రీనివాస్, సాహెరా బేగం (ఇమ్రాన్), బిఎల్ఓలు బొందు పార్వతి, షాహిదా, మాధవి, ఆయాలు సెలవు రోజైనప్పటికీ పంపిణి చేశారు. ఈ సందర్బంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఫారాలు అందజేశారు.అందులో ఒకటి నింపి తిరిగి బిఎల్ఓకు అందజేయాలన్నారు. ఫారంలో తప్పులు, దిద్దుడు లేకుండా సరిగా నింపాలన్నారు. ఈ నెల 26 ఓటర్ లిస్టు ప్రక్షాళన జరుగుతోందన్నారు. ప్రస్తుత ఓటర్ లిస్టులో పేరు ఉన్నవారు, వార్డుకు వలస వచ్చిన వారు లేదా కోడలిగా వచ్చిన వారు, వారి స్వగ్రామంలోని 2002 ఓటర్ లిస్టులో ఉన్న తమ తల్లిదండ్రులు లేదా తాతల ఎపిక్ నెంబర్లను సేకరించి ఉంచుకోవాలన్నారు. వలస వెళ్లిన వారు 30 రోజులలోపు వీలైనంత త్వరగా దరఖాస్తులను అందించాలన్నారు.

# శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండల కేంద్రంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు సురివి శ్రీనివాస్ గౌడ్ హాజరై మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతూ 'దేశ సమైక్యత, జాతీయత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానీయుడు అని న్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల సైదులు, సీనియర్ నాయకులు యట పెంటయ్య, పాముల రామచంద్రం పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి భవ్యకి స్వాగతం

**ప్రజాపక్షం/భువనగిరి :** యాదగిరిగుట్టలో జరుగుతున్న ఛాత్రోన్ కీ గూం జ్ కార్యక్రమానికి వెళ్తున్న యువ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి భవ్యకి భువనగిరిలో హోటల్ వివేరా వద్ద 22వ వార్డు కౌన్సిలర్ జాలిగం విష్ణుష్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు కైజర్, ముచ్చాల మనోజ్, వాసుదేవ్ రెడ్డి, బాబు పాల్గొన్నారు.



# సిసిటీవీ ఆధారాలతో 'హిట్ అండ్ రన్' కేసు ఛేదన

## ప్రమాదానికి కారణమైన లారీ స్వాధీనం.. డ్రైవర్ గుర్తింపు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామ శివారులోని కోదాడ జడ్చర్ల జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన హిట్ అండ్ రన్ ప్రమాద కేసును మిర్యాలగూడ రూరల్ పోలీసులు ఛేదించారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల సహాయంతో ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 25వ తేదీ రాత్రి సుమారు 11.15 గంటల సమయంలో బీహార్ రాష్ట్రానికి చెందిన వికాస్ కుమార్ రిషిదేవ్ (21) తన సహచరులతో కలిసి పని ముగించుకుని రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వికాస్ కుమార్‌ను సహచరులు 108 అంబులెన్స్ ద్వారా మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సహచరుల ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం ప్రమాదాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు సంఘటన స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ప్రమాద సమయంలో ప్రయాణించిన వాహనాల కదలికలను విశ్లేషించి కీలక ఆధారాలను సేకరించారు. దర్యాప్తులో ప్రమాదానికి కారణమైన ఏపీ 39 టీయూ 3299 నంబరు గల లారీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే లారీ డ్రైవర్‌గా మల్లికేశ్వరపు అనిల్ సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం మల్లన్ననగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని, కేసు దర్యాప్తు తదుపరి దశలో ఉందని పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే నిర్లక్ష్య డ్రైవింగ్‌పై కఠిన చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం



**ప్రజాపక్షం/నందికొండ :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా విజయపురి టౌన్ పోలీసులు హిల్ కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయపురి టౌన్ సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, మత్తు పదార్థాల నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

**ప్రజాపక్షం/తిప్పర్తి:** మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, విద్యార్థినులు భాగస్వాములు కావాలని ఎస్ఐ శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులతో కలిసి డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టడంలో ఎంఇఓ విఫలం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రైవేట్ పాఠశాలల్లో నియంత్రణ లేకుండా కొనసాగుతున్న ఫీజుల వసూళ్లను అరికట్టడంలో స్థానిక ఎంఈఓ పూర్తిగా విఫలమయ్యాడని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాల మహానాడు విద్యార్థి విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్క నాగేశ్వరరావులు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి పుస్తకాలు, యూనిఫాంలు, టైలు, బెల్టులు, బ్యాడ్జీల పేరుతో భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాలను ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సిన అధికారులు మౌనంగా ఉండటం వల్ల విద్యా రంగంలో అక్రమాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.విద్యను వ్యాపారంగా మార్చే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఈఓ పనితీరుపై సమగ్ర విచారణ జరిపి తగిన




చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ సైదా నాయక్, పాండు, రవి, సాయి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.